నందనంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

రైతుల నుంచి ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్. చౌహాన్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 23 : రైతుల నుంచి ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. మంగళవారం రాత్రి భువనగిరి మండలం నందనం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. టార్పాలిన్లు అందరికీ అందించాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగేతో కలిసి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను సమీక్షించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా, సజావుగా జరుగుతున్నాయని, ప్రతి గింజనూ మద్దతు ధరకు కొంటామన్నారు. దళారులు, మధ్యవర్తులు సమస్యలు సృష్టిస్తే జిల్లా కంట్రోల్ రూముకు ఫిర్యాదు చేయాలని రైతులను కోరారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, పౌర సరఫరాలు, మార్కెటింగ్, గ్రామీణాభివృద్ధి సంస్థ సమన్వయంతో రైతులకు మద్దతు ధరలపై, ధాన్యం ఏ ప్రమాణాలతో తేవాలి అనే విషయాలపై రైతులకు అవగాహన కలిగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 5820 మంది రైతుల నుంచి 57 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.30 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టరు పి.బెన్ షాలోమ్, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజరు గోపీకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ను సకాలంలో చెల్లించాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నాగారంలో వాసవి ఇండస్ట్రీస్‌లో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నాగారం, ఏప్రిల్ 23 : మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని వెంట వెంటనే ప్రభుత్వానికి అందించాలని, ధాన్యం దిగుమతిని వేగవంతంగా చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. మంగళవారం మండలంలోని వర్ధమానుకోటలో గల వసుధ, వాసవీ రైస్ మిల్లులను ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఎంఆర్ బియ్యాన్ని సకాలంలో పంపాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు. సకాలంలో సీఎంఆర్ పెట్టని మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో చేర్చడం జరుగుతుందని, అట్టి మిల్లులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట తాసీల్దార్ బ్రహ్మయ్య, ఏపీఎం శోభారాణి, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రాపాక సోమేశ్, లక్ష్మయ్య ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

సూర్యాపేట : ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా మద్యం, డబ్బు దుర్వినియోగం, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసాపత్రాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. స్వీప్ నోడల్ అధికారి, డీఈఓ అశోక్, డీఐఈఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి

కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి

- బీఆర్ఎస్ హుజూర్‌నగర్ సమన్వయ కమిటీ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి
- నేటి కేసీఆర్ మిర్యాలగూడ పర్యటనను విజయవంతం చేయాలి

నేరేడుచర్ల, ఏప్రిల్ 23 : శాసన సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టడంతో పాటు గతంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులు, ప్రవేశపెట్టిన పథకాలను వివరించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తపైనే ఉన్నదని బీఆర్ఎస్ హుజూర్‌నగర్ సమన్వయ కమిటీ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుడిలా పోరాడాలన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంతం 4 గంటలకు మిర్యాలగూడకు వస్తున్న పార్టీ అధినేత కేసీఆర్ పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. స్వార్థం కోసం పార్టీలు మారే వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందని, పార్టీని వీడిన వారిని తిరిగి పార్టీలోకి రానించే అవకాశం లేదన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎంపీ ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా అధికారి అతి ఉత్సాహం ప్రదర్శిస్తే పార్టీ ఏర్పాటు చేసిన లీగల్ సెల్‌కు ఫోన్ చేసి తెలుపాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుదామని పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మాజీ ఎంపీపీ చన్నబోయిన సైదులు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కొణతం లచ్చిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, గ్రంథాలయ మాజీ చైర్మన్ గుర్రం మార్కండేయ, మాజీ బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాపోలు నవీన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అనంతు శ్రీను, నాయకులు ఇంజమూరి రాములు, పిచ్చిరెడ్డి, రాజేశ్, చిన్న య్య, పిచ్చిరెడ్డి, సైదులు, సోమిరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

పవుశుల సంరక్షణ యాజమాన్యంపై అవగాహన

అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశు వైద్య సంవర్ధక అధికారి కుమారస్వామి

అనంతగిరి, ఏప్రిల్ 23 : వేసవిలో పశువుల ఆరోగ్యం పట్ల యాజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశు వైద్య సంవర్ధక అధికారి కుమారస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పాడి రైతులకు వేసవిలో పశువుల సంరక్షణకు తీసుకోవాల్సి చర్యలపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో పశువులకు మేత, నీరు అందుబాటులో ఉంచాలన్నారు. వేసవిలో పశువులను వదిలిపెట్టడం వల్ల అవి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పశువులు, మేకలు, గొర్రెలను మేతకు తీసుకెళ్లాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన సమయంలో కొట్టాల్లో, చెట్ల కింద పశువులను ఉంచాలన్నారు. పశువులు అనారోగ్యం బారిన పడితే స్థానిక పశు వైద్యశాలకు తరలించి చికిత్స చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రావు, మండల పశు వైద్యుడు సురేందర్, ఎల్ఎస్ఓ చిరంజీవి, జంగా శ్రీను, గోపి పాల్గొన్నారు.

మునగాలలో ఇంటి ఆవరణలోనికి దూసుకెళ్లిన బస్సు

ఇంట్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

మునగాల, ఏప్రిల్ 23 : జాతీయ రహదారి మీదుగా ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి 30 మంది ప్రయాణికులతో అమలాపురం వెళ్తున్న బస్సు మునగాల మండల కేంద్రంలో మసీదు సమీపాన అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఉప్పుల యుగేందర్‌రెడ్డి ఇంటి ఆవరణలోకి ఎల్‌టీ, 11కేవీ విద్యుత్ స్తంభాలను ఢీ కొడుతూ దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు.

నేటి నుంచి శుభవార్త దేవాలయ తిరునాళ్లు

మఠంపల్లి, ఏప్రిల్ 23 : మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయ వార్షిక తిరునాళ్లు బుధవారం ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు చర్చి విచారణ గురువు ఫాదర్ మార్టిన్ పసల తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బుధవారం ప్రత్యేక ప్రార్థనలతో వేడుకలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. 25న ఆలయంలో దివ్య బలిపూజ, మధ్యాహ్నం కొవ్వొత్తుల సమర్పణ, సాయంత్రం తెరు ప్రదర్శన నిర్వహించనున్నట్లు వివరించారు. శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక మాన్‌ఫోర్ట్ పాఠశాల గ్రౌండ్‌లో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 26 నుంచి 29 వరకు ఎద్దుల బల ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరిడేపల్లి, ఏప్రిల్ 23 : 33/11 కేవీ గరిడేపల్లి సబ్ స్టేషన్‌లో పరిధిలోని గరిడేపల్లి ఫీడర్ లైన్ల కింద గల చెట్ల కొమ్మలను తొలగించేందుకు బుధవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రావిరాల నగేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావునా ఫీడర్ పరిధిలోని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని కోటినాయక్‌తండాకు చెందిన ధరావత్ గోలియా (70) వడదెబ్బకు గురై మృతిచెందాడు. వారం రోజులుగా తీవ్ర ఎండలు, వడగాల్పులకు తట్టుకోలేక అస్వస్థతకు గురైన వృద్ధుడు మంగళవారం చనిపోయాడు. గోలియాకు భార్య, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఎల్‌ఎఫ్ సుధాకర్‌కు సన్మానం

నేరేడుచర్ల, ఏప్రిల్ 23 : మండలంలోని దాచారం ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందుతున్న నాయిని సుధాకర్‌ను మంగళవారం పీఆర్టీయూ నేరేడుచర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 34 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో రాణించి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత సుధాకర్‌ది అని కొనియాడారు. కార్యక్రమంలో ఎల్.శ్రీనివాస్, రమావత్ దీప్లానాయక్, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, చందమళ్ల వెంకన్న, కీసర ప్రసాద్, సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, జానయ్య, పుల్లయ్య, జానయ్య, వేణు, వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, రాగిరెడ్డి, బంధు మిత్రులు పాల్గొన్నారు.

నిఘా లోపం ఉండొద్దు

- సమన్వయంతో పని చేయాలి
- ఎన్నికల బందోబస్తుపై ఎస్పీ రాహుల్ హెగ్డే సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 23 : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఎన్నికలకు, ఎన్నికల సామగ్రికి, ఓటర్లకు భద్రత కల్పించడం ముఖ్యమని, ఎన్నికల విధుల్లో అన్ని స్థాయిల అధికారులతో సమన్వయంతో పని చేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సిబ్బకి సూచించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణ, భద్రతపై పోలీస్ నోడల్ అధికారులు, సీఐ, ఎస్ఐలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులు నిర్వహిస్తూనే సాధారణ విధులు, ఫిర్యాదులపై కూడా దృష్టి సారించాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే స్పందించేలా సిబ్బందిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల్లో పటిష్టంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని ఫ్లాగ్ మార్చ్‌లు, నాఖాబందీతో ప్రజలతో మమేకమై ఉండాన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ.5.66 కోట్ల విలువైన నగదు, ఆభరణాలు, ఇతర వస్తువులు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో హుజూర్‌నగర్ నోడల్ అధికారి, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, సూర్యాపేట నోడల్ అధికారి డీఎస్పీ రవి, కోదాడ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ట్రైనీ ఐపీఎస్ రాజేశ్‌మీనా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు వీర రాఘవులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రజితారెడ్డి, రాము, రామకృష్ణారెడ్డి, రఘువీర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, ఎన్నికల సెల్ ఎస్ఐ విష్ణుమూర్తి, మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆదరణ కరువై వీధినపడ్డ బాల్యం

- తల్లిదండ్రులు వేరుగా ఉండడంతో ముగ్గురు చిన్నారుల అవస్థలు
- భిక్షాటన చేస్తూ పోషిస్తున్న నానమ్మ
- చేరదీసిన రాయినిగూడెం గ్రామస్తులు
- బాలల పరిరక్షణ సిబ్బందికి అప్పగింత

గరిడేపల్లి, ఏప్రిల్ 23 : ఆలుమగల మధ్య వచ్చిన విభేదాలు పెరగడంతో వారిరువురు విడిపోయారు. ఇది వారి ముగ్గురు పిల్లల పాలిట శాపంగా మారింది. తల్లి వారిని పట్టించుకోకుండా వెళ్లిపోగా తండ్రి మద్యానికి బానిస కావడంతో పిల్లలకు ఆదరణ కరువైంది. దాంతో బతుకు జీవుడా అంటూ భారమైన బతుకును గడుపుతున్నారు ఆ చిన్నారులు. మండలంలోని రాయినిగూడెం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన సీహెచ్.సతీశ్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. తల్లిదండ్రుల మధ్య మనస్పర్థల కారణంగా వేర్వేరుగా ఉంటూ పిల్లలను ఎవరూ పట్టించుకోకపోవడంతో నానమ్మ సీతమ్మ భిక్షాటన చేస్తూ వారిని పోషిస్తున్నది. కొంత కాలంగా ఆమె మానసిక స్థితి సైతం సక్రమంగా లేకపోవడంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. మంగళవారం మండలంలోని రాయినిగూడెం గ్రామంలో ముగ్గురు చిన్నారులను తీసుకుని ఆమె భిక్షాటన చేయడాన్ని గమనించిన గ్రామస్తులు అంగన్‌వాడీ, పోలీస్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి సీతమ్మ నుంచి అన్ని వివరాలు సేకరించి బాలల పరిరక్షణ వారికి సమాచారం అందించారు. సిబ్బంది సాయిత్రిలోక్, రవికుమార్, మీరా వచ్చి పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ ఆదేశాల మేరకు బాల సదనం సూర్యాపేటకు తరలించారు. అధికారుల సూచనల మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

తుంగతుర్తి : మానాపురం సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య

నేటి కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సీతయ్య

తుంగతుర్తి, ఏప్రిల్ 23 : బుధవారం సాయంత్రం సూర్యాపేటలో జరిగే బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని మానాపురం గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి క్యామా మల్లేశ్‌యాదవ్ కారు గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంగ్లి, దశరథ, సుధాకర్ పాల్గొన్నారు.

మద్దిరాల : బుధవారం సూర్యాపేటలో, గురువారం భువనగిరి జిల్లా కేంద్రాల్లో నిర్వహించే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షో కార్యక్రమాలకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు ఎస్ఏ రజాక్ కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, జిలకర చంద్రమౌళి, వడ్డాణం మధుసూదన్, బద్దం సంజీవరెడ్డి, సుంచు అవిలయ్య పాల్గొన్నారు.

అర్వపల్లి : సూర్యాపేటలో బుధవారం సాయంత్రం జరిగే మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్ కోరారు. స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యాయాదవ్, ఎంపీటీసీ కనుకు పద్మాశ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు గోసుల విజయ్‌కుమార్, కిరణ్, ఎల్లంరాజు, రవీందర్, నాయకులు బైరబోయిన రామలింగయ్య, యుగేందర్, సుందర్, రామలింగయ్య, ప్రభు, మల్లయ్య, సైదులు పాల్గొన్నారు.

అర్వపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు సోమేశ్‌గౌడ్



మద్దిరాల : బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న రజాక్

మతోన్మాద బీజేపీని ఓడించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు

నేరేడుచర్ల, ఏప్రిల్ 23 : లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించేందుకు కార్మిక, కర్షక వర్గం ప్రతిన బూనాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు కోరారు. మంగళవారం స్థానిక అరిబండి భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాలరాస్తున్న ప్రధాని ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. అలాగే మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ గ్రామాన నిర్వహించే మే డే వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. అన్ని వర్గాల కార్మికులు ఐఖ్యంగా మే డే వేడుకలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశానికి నీలా రాంమూర్తి అధ్యక్షత వహించగా పార్టీ పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేశ్, పట్టణ కమిటీ సభ్యులు కుంకు తిరుపతయ్య, మీనయ్య, వరలక్ష్మి, రుద్రమ్మ, సంపత్, శ్రీను పాల్గొన్నారు.

ఉండ్రుగొండ గిరి దుర్గంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఉండ్రుగొండలో సుదర్శన హోమం

చివ్వెంల, ఏప్రిల్ 23 : మండలంలోని ఉండ్రుగొండ గిరి దుర్గంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం సుదర్శన నారసింహ హోమంను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వచ్చిన విష్ణు ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రోధి నామ సంవత్సరం చైత్రమాస సందర్భంగా నిర్వహించిన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో చిల్పకుంట్లలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది కవాతు

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ కవాతు

నూతనకల్, ఏప్రిల్ 23 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఉండేందుకు ముందస్తుగా పోలీసులు ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఎస్ఐ జూకూరి సైదులు ఆధ్వర్యంలో మండలంలోని చిల్పకుంట్ల, తాళ్లసింగారంలో పోలీస్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించి ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. ప్రతీ ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది మల్లయ్య, విజయ్ పాల్గొన్నారు.

శిఖం భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు

- నీటి పారుదల శాఖ ఏఈఈ కుర్మయ్య

పొనుగోడు చెరువును పరిశీలిస్తున్న నీటి పారుదల శాఖ ఏఈఈ కుర్మయ్య

గరిడేపల్లి, ఏప్రిల్ 23 : అనుమతులు లేకుండా చెరువులోని మట్టిని తరలించినా, చెరువు భూములను ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తప్పవని గరిడేపల్లి నీటి పారుదల శాఖ ఏఈఈ జి.కుర్మయ్య అన్నారు. మండలంలోని పొనుగోడు, కల్మల్‌చెర్వు, రాయినిగూడెం తదితర గ్రామాల్లోని చెరువులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనుమతులు ఉన్న రైతులు చెరువు కట్టకు దూరం తవ్వకం చేపట్టి మట్టిని తోలుకోవాలన్నారు. అలాగే తవ్వకాలను సమాంతరంగా చేపట్టి మట్టిని పొలాల్లో పోసుకోవాలన్నారు. అంతే కానీ మట్టిని అమ్ముకునే ప్రయత్నం చేసినా, ఇతర అవసరాలకు వాడినా, చెరువు భూమిని పూడపోసే ప్రయత్నం చేసినా ఎంతటి వారిపైనైనా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 23 : నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో 6, 7 తరగతుల విద్యార్థులు 110 మందికి మంగళవారం కాపీరైట్స్, అసైన్‌మెంట్ కోసం నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం బటు మధు మాట్లాడుతూ.. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు ఎండలో తిరగకుండా వారిలో సామర్థ్యాల పెంపు కోసం తెలుగు, హిందీ, ఇంగ్లీష్ బాషల్లో చక్కని చేతివ్రాత కోసం, గణిత ప్రాధాన్యం పెంపు కోసం సుమారు రూ.16 వేల విలువ గల నోట్ పుస్తకాలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు కొణతం సీతారాంరెడ్డి, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి,సూర్యనారాయణరెడ్డి, లూకాస్, సైదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ రూరల్ : విద్యార్థులు వేసవి సెలవుల్లో వివిధ రకాల విద్యా అంశాలపై తర్ఫీదు తీసుకోవాలని, మండే ఎండల పట్ల జాగ్రత్తగా ఉండాలని మహాత్మాజ్యోతీరావు పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.శోభారాణి అన్నారు. పట్టణ పరిధి కోమరబండ శివారులోని గురుకుల పాఠశాల విద్యా సంవత్సరపు లాస్ట్ వర్కింగ్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు.

విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి

నాగారం : విద్యార్థులు బాగా చదివి అనుకున్న లక్ష్యాన్ని అధిగమించాలని నాగారం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వర్దెల్లి మల్లయ్య అన్నారు. పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వేసవి సెలవులను ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు.

ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు

చిలుకూరులో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు

చిలుకూరు, ఏప్రిల్ 23 : ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీలకు గుడారాలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు అన్నారు. మంగళవారం చిలుకూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పనులు జరిగే చోట కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేట్లు చిలువేరు ఆంజనేయులు, మల్లెపంగు ఉపేందర్, కాశయ్య పాల్గొన్నారు.

నారాయణపురం సొసైటీలో విచారణ

చిలుకూరు, ఏప్రిల్ 23 : మండలంలోని నారాయణపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సీఈఓగా పని చేస్తున్న సాకి వెంకటేశ్వర్లు పుట్టిన తేదీని తప్పుగా నమోదు చేయించుకుని పదవీ విరమణ పొందకుండా ఇంకా విధులు నిర్వహిస్తున్నాడని సంఘం డైరెక్టర్లు జిల్లా సహకార అధికారికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజయ్య సహకార సంఘంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు సంఘం సీఈఓపై విచారణ చేస్తున్నట్లుగా తెలిపారు. అతడి స్టడీ సర్టిఫికెట్లు సేకరిస్తున్నట్లు చెప్పారు. సంఘం చైర్మన్ కొండా సైదయ్య, డైరెక్టర్ల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నట్లు వెల్లడించారు. విచారణ అనంతరం నివేదికను డీసీఓకు అప్పగించనున్నట్లుగా పేర్కొన్నారు.